# గోడ గడియారం

పది గంటలు కొడుతూ ఉండగా హాలులో టెలిఫోన్ మ్రోగింది.

గదిలో కూర్చుని ఊహాలోకాల్లో విహరిస్తున్న పద్మ గబుక్కున లేచింది. ఆమె గుమ్మందాటి బయటికి రాకముందే హాలులో సోఫాలో సుఖాసీనుడై భక్త బృందంతో ఇష్టాగోష్ఠి జరుపుతున్న నాగభూషణంగారు ఫోనెత్తటం, రాంగ్ నంబర్ అని చెప్పి విసుగ్గా పెట్టెయ్యటం— రెండూ జరిగిపోయినాయి.

నిరాశగా వెనక్కు తిరిగింది పద్మ.

ఇప్పటి కిది నాలుగవసారి— టెలిఫోన్ మోగటం, నాగభూషణంగారు ఎత్తటం, రాంగ్ నంబర్ చెప్పి పెట్టెయ్యటమూను.

పద్మకు చాలా చికాకుగా ఉంది.

పద్మ నాగభూషణంగారి కూతురు.

నాగభూషణంగారు రాజకీయనేత. శాసన సభ్యుడు. అధికార పక్షానికి చెందినవాడు. నెలలో సగం రోజులు ఊళ్ళోనే వుండడు. వున్న రోజుల్లో నైనా రోజంతా ఇంటి దగ్గర వుండటానికి వీలులేదు. వున్న కాస్సేపుకూడా ఏకాంతంగా గడపటానికి అవకాశం ఉండదు. తెల్లవారే టప్పటికి వచ్చి కూర్చుంటారు రాజకీయ భక్త బృందం సభ్యులు. వచ్చిన వాళ్ళు ఒకంతట వదలరు. పోనీ, ఏదైనా ఒక గదిలో కూర్చుని మాట్లాడుకున్నా అంత బాధ లేకపోను. హాలులో టెలిఫోన్ ముట్టా పరివేష్టించి కూర్చుని, ఉత్సాహంగా, ఉత్తేజంగా, ఆవేశంగా మాట్లాడుతూ, ఒళ్ళు మరచిపోయి గంటలు నిమిషాల్లా గడిపేస్తుంటారు. వాళ్ళు వున్నంత సేపూ నాగభూషణంగారు సోఫా దిగరు. టెలిఫోన్ వదలరు. వాళ్ళు సభ చాలించేంత వరకు పద్మకు టెలిఫోన్ దగ్గరికి వెళ్ళే అవకాశం వుండదు. అందుకనే తండ్రి ఊళ్ళోకు న్నారంటే భయం పద్మకు. కాని, తప్పదు మరి.

తనకు తెలుసు— ఇంతకు ముందు వచ్చిన నాలుగు ఫోన్ కాల్సూ రాంగ్ నంబర్లు కావనీ—తన కోసమేననీ. కాల్స్ చేసిన వ్యక్తి ఎవరో కూడా తనకు తెలుసు. అయినా, ఏం చెయ్యగలదు? తను తప్ప ఎవరు ఫోనెత్తినా, అవతలి వ్యక్తి రాంగ్ నంబర్ అని చెప్పి వెంటనే ఫోన్ పెట్టేస్తాడు. ఈ తతంగం నిన్నటిదీ, ఈ వేళటిదీ కాదు. రెండు సంవత్సరాల నుంచీ జరుగుతున్నదే. ఈ కథకు ముగింపూ, తనకు ముక్తీ ఎప్పటికి కలిగేటట్టు?

దీర్ఘంగా నిట్టూర్చింది పద్మ.

పద్మకోసం అన్నిసార్లు ఫోన్ చేసే వ్యక్తి పేరు సూర్యం. ఇతరులు ఫోనెత్తితే [illegible] పద్మను పిలవమని ధైర్యంగా చెప్పలేక పోతున్నాడంటే— అదేదో అక్రమ సంబంధం అని అపోహపడే అవకాశం ఉంటుంది కాని, అది సరికాదు.

అసలీ సూర్యం ఎవరు?

పద్మకూ, అతనికీ మధ్య ఉన్న సంబంధం ఎలాంటిది?

ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే పూర్వ కథ కొంచెం చెప్పుకోవాలి.

నాగభూషణంగారు గ్రామ రాజకీయాల్లో తిరుగుతున్న రోజుల్లోనే ఆంజనేయులు అనే విశ్వాసపాత్రుడైన ఒక అనుయాయుడు ఆయనకు లభించాడు. ఆంజనేయుల్ని అనుయాయుడు అనటం కన్న శిష్యుడు అనటం సమంజసంగా ఉంటుంది. ఎందుకంటే నాగభూషణంగారి వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకోవాలన్న ఉద్దేశ్యంతోనే అతను చేరాడు. అవసరమనుకున్న పరీక్షలెన్నో జరిపి, ఫర్వాలేదనుకున్న తరవాతనే ఆంజనేయుల్ని తన వెంట తిప్పుకో నారంభించారు నాగభూషణంగారు. కాలక్రమంలో గ్రామం మంచి తాలూకా, జిల్లాలు దాటి— రాష్ట్ర రాజకీయాల వరకు ఎదిగి పోయారు నాగభూషణంగారు. ఆంజనేయులికి అంత పైకి పోవాలన్న ఆశా లేదు. అంతటి అవకాశమూ లేదు. ఏదో నాగభూషణంగారి చలవ వల్ల కౌన్సిలర్ పదవి దాటి, వైస్ ఛెయిర్మన్ కాగలిగాడు. మరొక్క మెట్టు ఎక్కి మ్యునిసిపల్ ఛెయిర్మన్ అనిపించుకుంటే చాలు నన్న ఉద్దేశ్యంలో ఉన్నాడతను. అదిగో—అలాంటి సమయంలోనే ఒక విచిత్రం జరిగింది.

నాగభూషణం గారికి రాజకీయ పరిజ్ఞానం పుష్కలంగా వుంది కాని, ఆస్తి పాస్తులు అంతంత మాత్రమే. పెళ్ళికి ఎదిగి కూర్చున్న పెద్ద కూతురు పద్మ ఆయనకు ఒక పెద్ద సమస్య అయి పోయింది. చేతినిండా డబ్బుంటే అదొక సమస్య కానేకాదు. ఒక అయినింటి కుర్రవాణ్ణి కొనుక్కు వచ్చి, మూడు క్షణాల్లో ముడి పెట్టించెయ్య వచ్చు. మరి డబ్బు లేదు. ఓపికగా తిరిగి సంబంధాలు వెదకటానికి తీరికా లేదు. రాజకీయాల్లో వున్న హుషారు కుటుంబ విషయాల్లో లేకపోవటం చేతనే అయిన తప్పుకాదు. పాపం! అయినా తప్పదు కనక ఒకటి రెండు రోజులు తీవ్రంగా ఆలోచించాడు. చంకలో మేక పిల్లలా ఆంజనేయులు కనిపించాడు.

ఆంజనేయులు కేం? నిక్షేపం లాంటి మనిషి. రాజకీయాల్లో అంతగా రాణింపు లేకపోయినా, తాతలు సంపాదించి ఇచ్చిన బంగారం లాంటి భూములు ఉన్నాయి. భుక్తికి లోటు ఉండదు. పైగా తన పట్ల ఎనలేని విశ్వాసం. రాజకీయ రంగంలో అభిరుచి. తన మాటపై గురి, ముందు ముందు అవసరానికి ఉపయోగపడతాడన్న నమ్మకం తనకు ఉన్నది. అందుకనే వెంటనే అతన్ని పిలిపించి విషయం కదిపాడు.

ఆంజనేయులు ఎగిరి గంతెయ్య లేదు కాని, అదంతా తన అదృష్టం గానే భావించాడు. సాక్షాత్తూ నాగభూషణంగారితో సంబంధం కలుపుకోవటం అంటే తన పితృ పితామహులు చేసుకున్న పుణ్యఫలమే నని తలపోశాడు.

ఆనంద పారవశ్యంలో ఎక్కువగా మాట్లాడలేక "మహాభాగ్యం, గురుదేవా!" అన్నాడు ఆంజనేయులు చేతులు జోడించి. లక్షలు కట్నంతో పిల్లల్ని ఇస్తా మంటూ ఇంటి చుట్టూ తిరుగుతున్న ఆడపిల్లల తండ్రుల్ని కాదని, పైసా కట్నం లేకుండా నాగభూషణంగారి కుమార్తె పద్మను తన ఏకైక కుమారుడు సూర్యానికి భార్యగా చేసుకున్నాడు ఆంజనేయులు.

ఆంజనేయులు చేసింది నిజానికి త్యాగమే. కాని, గురుదక్షిణ ఇచ్చినట్లుగా సరిపెట్టుకుని, సంతృప్తి పడ్డా డతను.

అంతవరకు సవ్యంగా జరిగిన కథ అక్కడే మలుపు తిరిగింది.

రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు వచ్చాయి. పార్టీ టిక్కెట్టు ఇచ్చింది. పోటీ చేశాడు నాగభూషణం.



శాయశక్తులా కృషి చేశాడు ఆంజనేయులు. గెలిచాడు నాగభూషణం. అయితే, అధికారం మరొక పార్టీకి దక్కింది. వెంటనే ఆ పార్టీలో చేరి పోయాడు నాగభూషణం. అది నచ్చలేదు ఆంజనేయులుకి.

"ఒక పార్టీ టిక్కెట్టు మీద పోటీ చేశావు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. వాళ్ళందర్నీ కాదని ఇప్పుడు మరో పార్టీలో చేరిపోవటం న్యాయంగా లేదు, బావగారూ!" అన్నాడు కాస్త ధైర్యంగానే




ఆంజనేయులు.

ఎంత అమాయకుడవోయ్! అన్నట్టు చూసి చిరునవ్వు నవ్వారు నాగభూషణంగారు. "రాజకీయాల్లో నువ్వింకా విద్యార్థి వేనోయ్, ఆంజనేయులూ! తలలు పండిన వృద్ధుల ఎత్తుగడలు నీ కిప్పుడే అర్థం కావు!" అనేశారు.

మళ్ళీ మాట్లాడే ధైర్యం లేకపోయింది ఆంజనేయులుకి. అప్పటి నుంచీ వాళ్ళిద్దరూ రాజకీయ వ్యవహారాల్లో కాస్త ముభావంగా ఉండడం ప్రారంభమైంది. మరో రెండు నెలల్లో ఆ పార్టీ పడిపోయి, ప్రభుత్వం మరో పార్టీ చేతిలోకి వచ్చింది. మద్దతుదార్లను సంప్రదించకుండానే అందులోకి దూకేశాడు నాగభూషణంగారు. ఈ రెండేళ్ళ లోనూ మొత్తం ఆరు సార్లు పార్టీ మార్చాడు. ఒక పార్టీ లోంచి మరో పార్టీలోకి దూకటం అలవాటై పోయింది ఆయనకు. మంత్రి పదవి వచ్చే అవకాశం ఎలాగూ లేదు. కనీసం అధికార పక్షంలోనైనా ఉండాలని ఆయన తాపత్రయం. గాలి వాటాన్ని బట్టి అధికారం మరో పార్టీ హస్తగతం అవుతుందని ఊహించి ముందుగానే అందులోకి దూకెయ్యటం, తరవాత అది తారుమారు అయినప్పుడు నిస్సంకోచంగా వెనక్కు వచ్చెయ్యటంకూడా రెండు మూడు సార్లు జరిగింది. మొత్తం మీద పార్టీలు మార్చటం ఆయనకు అలవాటై పోయింది. అందులో ఆయన కేం తప్పు కనిపించ లేదు. సిద్ధాంతాలు, నైతిక బాధ్యతలు

**—చంద్రం**

వగైరా ఆలోచనలే రావాయనకు. ఎవరన్నా నిలదీసి ప్రశ్నిస్తే తేలికగా సమాధానం చెప్పేస్తాడు. "ఏ పార్టీ ప్రణాళిక తీసి చూసినా ప్రజల్నీ, దేశాన్నీ ఉద్ధరిస్తామనే ఉంటుంది కాని, పాడు చేస్తామని ఉండదు కదా! కాబట్టి అన్ని పార్టీల సిద్ధాంతాల సారాంశమూ ఒక్కటే. అందువల్ల ఏ పార్టీలో ఉన్నా ఒక్కటే. అయితే మన సౌకర్యాన్ని బట్టి ఎప్పటికి ఏ పార్టీ అవసరం అనిపిస్తే అందులో పని చేస్తూంటాం" అనేస్తాడు చిరునవ్వు చిలికిస్తూ.

ఆంజనేయులుకి ఈ వాదం నచ్చలేదు. స్వార్థ ప్రయోజనాల కోసం ఊసర వెల్లిలా రంగులు మారుస్తున్న నాగభూషణంగారిని గురువుగా భావించటం ఆయనకు నామోషి అనిపించింది. రాజకీయాల్లో కూడా నీతి నియమాలు పాటించా లన్నది అతని సిద్ధాంతం. ఆ కారణం చేత అతను బిగిసి పోయాడు.

గుడ్డు వచ్చి పిల్ల నెక్కిరించిం దన్నట్టు,—నిన్న కాక మొన్న రాజకీయాలో ప్రవేశించి, తన దగ్గర ఓనమాలు దిద్దుకొని, తనకే నీతులు చెప్ప వస్తున్న ఆంజనేయుల్ని కాస్త ఎడంగా వుంచటం ఎంతైనా శ్రేయస్కరం అని అభిప్రాయపడ్డాడు నాగభూషణంగారు. పైగా ఆస్తి ఇచ్చే హోదాకన్న రాజకీయ హోదా గొప్పదని ఆయన ప్రగాఢ విశ్వాసం కాబట్టి ఎప్పటికైనా ఆంజనేయులే తన దారికి రావాలనీ, వస్తాడనీ ఆయన ఉద్దేశ్యం. ఈ కారణంచేత ఈయనా బిగిసి పోయాడు.

పర్యవసానంగా రెండు కుటుంబాల మధ్య రాకపోకలూ, మాటా మంతీ బంద్ అయిపోయాయి.

పెద్దవాళ్ళకేం ? హాయిగానే ఉన్నారు. సుడిగుండంలాంటి ఈ రాజకీయ గందరగోళంలో ఎలాంటి సంబంధం లేని పసివాళ్ళు—పద్మ, సూర్యం—అనవసరంగా ఇబ్బందులపాలై పోయారు. పెళ్ళీ, ఆ తరవాత కార్యక్రమం సజావుగానే జరిగినాయి. కాని, కోడల్ని ఇంటికి తెచ్చుకొనే ఉద్దేశ్యం ఆంజనేయులు వ్యక్తం చెయ్యలేదు. కూతుర్ని కాపురానికి పంపించే ప్రయత్నం నాగభూషణమూ చెయ్యలేదు. పద్మ ఇక్కడ, సూర్యం అక్కడ. కొత్త మోజు తీరకముందే వియోగం ప్రారంభమైంది. ఆ యువ హృదయాల ఆరాటం, విరహ బాధ రాజకీయ ఉన్మత్తులైన పెద్దల కెలా అర్థమవుతాయి ? వాళ్ళు బిగుసుకుపోయింది చాలక, పిల్లలకు ఈ ఆంక్షలు విధించారు. ఈ ఇంటి మీద వాలిన కాకి ఆ ఇంటిమీద వాలటానికి వీలులేదు. అందుకు అవసరమైన కట్టుదిట్టాలు పటిష్టంగా చేశారు.

మనసు ఉంటే మార్గమే లేకపోతుందా ! అన్న మాట నిజమేనని రుజువు చేశారు పద్మ, సూర్యం.

రెండు ఇళ్ళలోనూ టెలిఫోన్ సౌకర్యం ఉంది. లోకల్ కాల్స్ ఒక్కసారిగా పెరిగిపోయినాయి. బిల్లులు విపరీతంగా రాసాగినాయి. అయితే చేసే ప్రతి పది కాల్సులోనూ తొమ్మిది కాల్సు వృథా అయిపోతున్నాయి—రాంగ్ నంబర్ పేరు మీద. మిగిలిన ఒక్కసారి అయినా తృప్తిగా మాట్లాడుకో గలమన్న గారంటీ లేదు. ఎన్నో అవాంతరాలూ, భయాలూను. అయినా టెలిఫోన్ డిపార్టుమెంటు వారి పుణ్యమా అని లోకల్ కాల్సుకు టైమ్ లిమిట్ లేదు కనక, అవకాశం చిక్కినప్పుడు ఎంతసేపైనా మాట్లాడుకోవచ్చు. కాని, ఒకరి నొకరు చూసుకోకుండా, కలుసుకోకుండా ఎంత కాలమని మాటలతో సంతృప్తి పడగలరు? మరొక్క అడుగు ముందుకు వేసి పెద్దల కన్ను గప్పి, అప్పుడప్పుడు సంకేత స్థలాల్లో కలుసుకోసాగారు.

ఈవేళ—ఒక్క గంటలోనే నాలుగుసార్లు ఫోన్ చేశాడంటే సూర్యం—ఏదో ముఖ్యమైన సమాచారం చెప్పటానికే అయి ఉంటుందని అనుకొంది పద్మ. నాలుగు రోజుల క్రితం తను మాత్రం ఏం చేసింది? తండ్రి ఊళ్ళో లేడు. తల్లి పక్క ఊళ్ళో వున్న బంధువుల ఇంట్లో ఏదో శుభకార్యం జరుగుతూ ఉంటే సాయంత్రానికి వచ్చేస్తానని చెప్పి, ఉదయాన్నే బయలుదేరి వెళ్ళింది. చెల్లెళ్ళూ, తమ్ముడూ స్కూలుకు వెళ్ళిపోయారు. వాళ్ళు సాయంకాలానికి కాని రారు. ఈ శుభవార్త చెప్పి సూర్యాన్ని రప్పించుకోవాలని ప్రయత్నిస్తే—తన ఆరాటమే కాని అంత తొందరగా సానుకూలపడిందా! ఎన్ని తడవలు ఫోన్ చేసినా అత్తగారో, మామగారో ఫోను ఎత్తేవారు. ఆఖరికి పన్నెండవ సారి కాబోలు అతను దొరికాడు. అప్పటికే మధ్యాహ్నం పన్నెండు గంటలు అయిపోయింది. అప్పటికైనా దొరికినందుకు సంతోష పడింది. అసలు దొరకడేమోనని భయపడింది. ఇంత చక్కని అవకాశం

# చిత్ర కథలు

'లత' రాస్తున్న చిత్రకథలు వచ్చే సంచిక నుంచి ప్రారంభం!


చెయ్యి జారిపోతుందని నిరుత్సాహ పడింది కూడాను. ఇప్పుడు సూర్యం పిలిచిన కారణం కూడా ఇలాంటిదే ఏదో అయి వుంటుంది. అందుకనే ఎంతో ఆరాటంగా వుంది పద్మకు. తండ్రి ఎంత త్వరగా బయటికి వెళ్ళిపోతాడా అని ఎదురు చూడసాగింది.

మరొక అరగంట గడిచిన తరవాత కారు వప్పుడు వినిపించి బయటికి వచ్చింది పద్మ. నాగభూషణంగారు భక్త బృందంతో కలిసి కారెక్కి వెళ్ళిపోయారు. ఆ క్షణంకోసమే ఎదురు చూస్తున్న పద్మ గబగబా ఫోను ఎత్తి అత్తగారి ఇంటి నంబర్ తిప్పింది. ఎంతకీ పలకలేదు. ఒకవేళ రాంగ్ డయల్ అయి వుంటుందేమోనని మళ్ళీ ఒకసారి జాగ్రత్తగా తిప్పింది. ఈసారీ జవాబు లేదు. ఫోన్ పెట్టేసి, కొద్ది క్షణాలు తీవ్రంగా ఆలోచించింది—ఎక్కడినించి ఫోన్‌చేసి వుంటారా? అని.

ఆంజనేయులుగారికి బజారులో ఎరువుల షాపు ఒకటి ఉంది. అక్కడా టెలిఫోన్ ఉంది. ఒకవేళ అక్కడినించి చేశారేమో? ఆ నంబర్ పిలిస్తే? సాధారణంగా షాపులో మామగారే కూర్చుంటారు. ఆయన టేబుల్ మీదే టెలిఫోన్ ఉంటుంది. ఆయన లేనప్పుడే సూర్యం ఆ స్థానంలో కూర్చోవటం జరుగుతుంది. అందుకనే ఆ నంబర్ ఎక్కువగా పిలవదు పద్మ. ఇప్పుడు తప్పదు కనక, జడుస్తూనే షాపు నంబర్ తిప్పింది. మామగారు ఫోనెత్తితే రాంగ్‌నంబర్ అని చెప్ప టానికి కూడా ధైర్యం చాలదు తనకు— ఎక్కడ గొంతు గుర్తుపట్టేస్తాడోనని భయం.

అమ్మయ్య! సూర్యమే ఫోనెత్తాడు. సూర్యం గొంతు తనకు గుర్తే. అతనూ తన గొంతు గుర్తుపట్టగలడు ఫోనులో. అయినా, ఎందుకైనా మంచిదని, కొన్ని సాంకేతిక శబ్దాలు ఉచ్చరించి, పరస్పరం ఐడెంటిఫై చేసుకొని, ఆ తరవాతనే సంభాషణ ప్రారంభించటం అలవాటు చేసుకున్నారు.

ఈ రోజు తను ఎప్పటినించి ప్రయత్నిస్తున్నదీ, ఎన్నిసార్లు ఫోన్ చేసినదీ, ఎంత కష్టపడ్డదీ వివరించి, అంతసేపు ఫోన్‌లో దొరక్కపోవటానికి కారణాలు అడిగి, సంజాయిషీ చెప్పించుకోవాలన్న తాపత్రయం సూర్యానికి లేదు. ఈ విధమైన అనుభవాలు ఇద్దరికీ అలవాటైపోయినాయి. ప్రతి సారీ వాటిని తిరగతోడుకోవటం వృథా ప్రయాస గానూ, అనవసర కాలయాపనగానూ భావించి, సూటిగా ప్రస్తుతాంశాన్ని ప్రస్తావించటం విధిగా అలవర్చుకున్నారు.

"ఈవేళ అమ్మా, నాన్నా ఊరెళ్ళారు—మా చిన్నాన్నగారి అమ్మాయి వివాహ విషయం గురించి మాట్లాడానికి. వాళ్ళు తిరిగి వచ్చేసరికి ఏ అర్ధరాత్రో అవుతుంది. నువ్విప్పుడు బయలు దేరి ఇంటికి రాగలవా?"

"మరి షాపు సంగతి?"

"గుమాస్తాకు అప్పగిస్తాలే కాని, ఒక పది నిమిషాల్లో వచ్చెయ్యగలవా?"

"ప్రయత్నిస్తాను, మరి."

"ప్రయత్నించడం కాదు. ఏదో వంక చెప్పి వచ్చెయ్యాలి. వీధి మొగలో రిక్షాతో తయారుగా వుంటాను. వచ్చేస్తావుగా?"

వెనక ఏదో చప్పుడైతే తిరిగి చూసింది పద్మ. తల్లి వస్తూంది. పద్మ గుండెలో రాయిపడింది. ఫోన్‌లో ఏమీ సమాధానం చెప్పలేకపోయింది.

"మాట్లాడవేం?" హెచ్చరించాడు సూర్యం.

"వు... వు..." అంటూంది పద్మ.

పరిస్థితి వూహించి—"ఎవరన్నా వచ్చారా అక్కడికి? సరే అయితే, వచ్చేదీ, లేనిదీ చెప్పేయ్—ఫోన్ పెట్టేస్తాను" అన్నాడు సూర్యం.

"అలాగే. ఒక పది నిమిషాల్లో వస్తానులే" అనేసి ఫోన్ పెట్టేసింది పద్మ.

చివరి మాటలు విన్న పద్మ తల్లి—"ఎక్కడికే వస్తానంటున్నావు? ఎవరా మాట్లాడింది?" అని ప్రశ్నించింది కూతుర్ని.

సమయ సందర్భాలు బట్టి, ఎప్పుడు ఎక్కడ ఎలాంటి సమాధానం చెపితే అతికినట్టు సరి పోతుందో ఊహించి ఒక జాబితా తయారు చేసుకుంది పద్మ. అనేక సందర్భాలలో ఉపయో గించి సత్ఫలితాలను పొందింది కూడా. అందుకనే ఈసారి కూడా తడుముకోకుండా సమాధానం—అబద్ధమే—చెప్ప గలిగింది.

"శకుంతల అనీ...నా స్నేహితురాలమ్మా! వాళ్ళాయనకు ఢిల్లీలో ఉద్యోగం వచ్చిందట. ఈ రాత్రికే బయలుదేరి వెళ్ళిపోతున్నారట! ఒకసారి రమ్మంటూంది. వెళ్ళి చూసి వచ్చేస్తాను."

"శకుంతలంటే ఎవ రమ్మాయి?"

"నీకు తెలియదులే. ఎప్పుడూ మన ఇంటికి రాలేదు" అనేసి, బాత్‌రూమ్‌లో దూరి గబ గబా ముఖం కడుక్కొని, అయిదు నిమిషాల్లో అలంకరణ ముగించి, చీర మార్చుకొని బయట పడింది పద్మ.

అన్న ప్రకారం వీధి మొగలో రిక్షా నిలిచి వుంది. పక్కనే స్కూటర్‌మీద సూర్యం.

నాలుగు మూరల మల్లెచెండు పద్మమీదికి గిరాటువేసి, "త్వరగా ఎక్కు" అని, స్కూటర్ స్టార్ట్‌చేసి, పైలట్‌లా ముందు బయలుదేరాడు సూర్యం.

రిక్షా ఎక్కుతున్న పద్మ మనస్సు చివుక్కుమంది. అన్నీ ఉన్నా అనుభవించే యోగ్యత ఉండదంటారు కొందరికి—ఇదే కాబోలు అనుకుంది. కాకపోతే, భర్త స్కూటర్‌మీద వెళుతూంటే, వెనక కూర్చొని, అతని నడుము చుట్టూ చేతులువేసి కులాసాగా ప్రయాణం చెయ్యవలసిన తను, ఇలా ఒంటరిగా రిక్షాలో వెళ్ళటం ఏమిటి? భార్యాభర్తలై వుండీ భయం భయంగా మాట్లాడు కోవటం, చాటుమాటుగా కలుసుకోవటం, నేరస్థుల్లా తప్పుకు తిరగటం—ఎక్కడైనా వుందా ఇలాంటి పద్ధతి?

అటు పల్లె, ఇటు పట్నంగాక మధ్యస్తంగా వుండే బస్తీ అది. పుర ప్రముఖులైన నాగభూషణం గారినీ, ఆంజనేయులుగారినీ ఎరగని వాళ్ళు బహు తక్కువ అక్కడ. బీచ్‌లూ, పార్కులూ లేక పోయినా, హోటళ్ళూ, లాడ్జింగులూ, సినిమా హాళ్ళూ ఉన్నాయి. కాని అలాంటివన్నీ ఈ యువ జంట కలుసుకోవటానికి అనువైన స్థలాలు కావు. అంతవరకెందుకు? ఒకే స్కూటర్‌మీద కాని, ఒకే రిక్షాలో కాని, కాలినడకను కాని బజారులో వీళ్ళు కలిసి కనిపిస్తే, ఇరవై నాలుగు గంటలలోపల ఈ వార్త ఇరుపక్షాల పెద్దలకూ తెలిసిపోతుంది. ఆ భయంతోనే ఇలా చాటు మాటుగా వ్యవహరించవలసి వస్తూంది.

పెద్దల్ని ఎదిరించే ఉద్దేశ్యం కానీ, అందుకు అవసరమైన తెగింపు కానీ వాళ్ళకు లేవు. వివాహ బంధం వాళ్ళ సంబంధాన్ని సమర్థిస్తున్నప్పటికీ, పెద్దల్ని ఎదిరించే స్థాయికి వీళ్ళింకా ఎదగలేదు. అంతవరకు ఈ తిప్పలు తప్పవు. ఆ శుభదినం త్వరలోనే వస్తుందని ఆశిద్దాము.

**(ప్రియుని వద్దకు తానే స్వయంగా పోవు నాయిక, ప్రియుని తన వద్దకు రప్పించు కొనునది అభిసారిక.)**

**(సమాప్తం)**